క్లుప్తంగా

మలేరియాను తరిమికొడదాం



చిట్టేడులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కోట: మలేరియా రహిత సమాజం కోసం కృషి చేయాలని చిట్టేడు పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు సూచించారు. చిట్టేడులో సోమవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం ర్యాలీని నిర్వహించారు. డాక్టర్లు, వైద్యసిబ్బంది, సచివాలయ ఉద్యోగులు ర్యాలీ చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మలేరియా వంటి విషజ్వరాలు ప్రబలకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. జ్వరాలను నిర్లక్ష్యం చేయకుండా ఆరోగ్యకేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

బీసీజీ టీకాను వేయించుకోండి



బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పిస్తున్న సదర్శనమ్మ

రాపూరు: మండలంలో 60 సంవత్సరాలోపు ఉన్నవారు బీసీజీ టీకాను వేయించుకోవాలని డాక్టర్ సుదర్శనమ్మ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ వద్ద సోమవారం బీసీజీ టీకాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనకు బీసీజీ టీకాను వేస్తున్నట్లు చెప్పారు. మండలంలో 10 వేల మందికి ఈ వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్షయవ్యాధి నిర్మూలనకు సహకరించి ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అబ్దుల్, సుప్రజ, కాంతమ్మ, హరిత, సురేఖ పాల్గొన్నారు.

మండలానికి చేరిన విద్యాకానుక



ఏకొల్లు జెడ్పీ హైస్కూల్‌లో నోటు పుస్తకాలు దించుతున్న సిబ్బంది

దొరవారిసత్రం : మండలంలోని 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన విద్యాకానుకలు సోమవారం ఏకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌కు చేరినట్టు ఎంఈవో కృష్ణయ్య తెలిపారు. జూన్ మొదటి వారంలోనే 1 నుంచి 7వ తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు చేరినట్లు పేర్కొన్నారు. స్టాక్ పాయింట్‌కు చేరిన పుస్తకాలు, నోటు పుస్తకాలు, బూట్లు, టై తదితర అన్ని ఆయా పాఠశాలలకు సరఫరా చేస్తున్నామన్నారు.

వాకాడులో గాలీవాన



అశోక్ స్తంభం కూడలిలో కురుస్తున్న వర్షం

వాకాడు : నైరుతి రుతు పవనాల ప్రభావంతో మండలంలో మూడు రోజులుగా పెనుగాలులు వీయడంతోపాటు భారీ వర్షం కురుస్తోంది. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం ఆకాశంలో నల్లని మబ్బులు కమ్ముకున్నాయి. ఈదురు గాలులతో మొదలైన వర్షం గంటకు పైగా కుండపోత వర్షం కురిసింది. దీంతో లోతట్టు వీధులు వర్షపు నీటితో నిండిపోయాయి. మూడు రోజులుగా వర్షం పడుతుండడంతో రైతులు సాగుకు సిద్ధమయ్యారు. కల్లాల్లో తయారు చేసుకున్న ఇటుకలు తడిచిపోవడంతో బట్టీల యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు.

అందరికీ ఉపాధి పనులు కల్పించాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

బాలాయపల్లి(సైదాపురం) : గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని ఉపాధి హామీ పథకం పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం బాలాయపల్లి పంచాయతీలో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులకు వచ్చే కూలీలకు కనీస వేతనం రూ.300 వచ్చేలా పనులు చేయించాలన్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మృత్యుంజయ రావు, ఈసీ కరుణాకర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 6.506 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 6.506 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 40, లోలెవల్ కాలువకు 70 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్బీకేలతో నకిలీలకు చెక్





చిలమానుచేనులో నిర్మించిన ఆర్బీకే, ఓజిలి ఆర్బీకేలో రైతులకు ఎరువులు అందజేస్తున్న ఏవో విజయలక్ష్మి (ఫైల్)

- రైతులకు అందుబాటులో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు
- పంటల సాగులో సలహాలు, సూచనలు

ఓజిలి: రైతు ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తాడు. తగిన దిగుబడి రాకుంటే నష్టాల పాలవుతాడు. సరైన సమయంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు పంపిణీ చేయాలి. సాగులో తగిన సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది. ఈ విషయాలను గుర్తించిన ప్రభుత్వం రైతులకు వ్యవసాయంలో అండగా ఉండాలని రైతు భరోసా కేంద్రాలు తీసుకువచ్చింది. వాటిలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రంలో ఆన్‌లైన్ చేస్తే నేరుగా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కేంద్రాలు ద్వారా వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖలు మరింతగా చేరువుగా ఉండి సలహాలు, సూచనలు అందిస్తున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో తడ మండలంలో 11, సూళ్లూరుపేటలో 8, దొరవారిసత్రంలో 5, నాయుడుపేటలో 11, పెళ్లకూరులో 13, ఓజిలిలో 10 కేంద్రాలు ఉన్నాయి.

రైతుల సందేహాలు నివృత్తి

వ్యవసాయంలో రైతుల సందేహాలను నివృత్తి చేసి, వారి సూచనలను పరిగణలోకి తీసుకోవడమే రైతు భరోసా కేంద్రాల ముఖ్య ఉద్దేశం. ఈ కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. వీటికి అనుగుణంగా కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన కేంద్రాలు పనిచేస్తున్నాయి. వాటిలో పనిచేసే నిపుణులు, శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా రైతులకు ప్రకృతి వ్యవసాయంలోని బీజామృతం, పంచగవ్య, ఘనజీవామృతం తదితర కషాయాలను తయారు చేయడంపై అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి రైతులకు ఆదాయం పెరుగుతోంది.

స్థానికంగానే ఎరువులు, పురుగు మందులు



ఆర్బీకేలో ఏర్పాటు చేసిన కియోస్క్ పరికరం

విత్తనాల కోసం రైతులు పట్టణాలు, మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పని అసలే లేవు. గ్రామాల్లోని ఆర్బీకేల ద్వారానే రైతులకు నేరుగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఖరీఫ్‌లో 80 వేల మంది రైతులు ఉండగా 12,500 హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. పొలంబడి ప్రదర్శన క్షేత్రం ఏర్పాటు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో సాగుచేసే విత్తనాల నమూనాలను ఉంచుతున్నారు.

రైతులకు ప్రాధాన్యం



ఆర్బీకేల వల్ల రైతులకు ఎంతో ఉపయోగం ఉంది. ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో రైతు భరోసా కేంద్రాలలో దరఖాస్తు చేసుకుంటే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పెట్టుబడి సాయం, వరికి మద్దతు ధర వెంటనే అందుతాయి. నకిలీ విత్తనాల బెడద తప్పింది. సిబ్బంది ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

- రామ్‌మోహన్, వీర్లగునపాడు

అగచాట్లు తప్పాయి



పంటల సాగులో రైతులకు స్థానికంగానే అన్ని విధాలుగా సాయం అందించేలా ఆర్బీకేలను తీసుకురావడం గొప్ప పరిణామం. ఈ కేంద్రాలు ద్వారా పురుగు మందులు, ఎరువులు, విత్తనాలను అందుతున్నాయి. అధికారులు అందరు ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉంటూ రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. వ్యయప్రయాసలు తగ్గాయి.

- వెంకటరమణయ్య, రుద్రాయపాళెం

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేస్తున్నాం

ప్రభుత్వం ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారానే అందజేస్తున్నాం. రైతులు ప్రయివేటు వ్యక్తులను ఆశ్రయించి మోసపోవద్దు. ఎవరికి ఎంత అవసరమున్నా అందజేసేందుకు సిద్ధంగా ఉన్నాం. అంతేగాక సాగులో తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నాం. ఏయే పంటలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది అన్న విషయాన్ని కూడా తెలియజేస్తున్నాం.

- విజయలక్ష్మి, వ్యవసాయాధికారిణి, ఓజిలి

వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



నాయుడుపేట టౌన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని సోమవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో జగనన్న ఆప్యాయంగా పలుకరించారు. నియోజవర్గంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ అండగా నిలవాలని మాజీ సీఎం సూచించినట్టు కిలివేటి పేర్కొన్నారు. గెలుపు, ఓటములు సర్వసాధారణమని, ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండాలని తెలిపినట్లు వివరించారు. కష్టంతో జగనన్న వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరితోనూ మాట్లాడి వారికి ధైర్యం చెప్పారని సంజీవయ్య పెర్కొన్నారు.

స్తంభాలగిరీశ్వరయ్యకు విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో స్తంభాలగిరీశ్వరయ్యస్వామి, విశేష అలంకరణలో అమ్మవారు

దక్కిలి: మండలంలోన దేవునివెల్లంపల్లిలో వెలసిన స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు చేశారు. అర్చకులు ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అలంకరణలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పెట్టారు. భక్తులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామి వారి శిష్యులు పోలయ్య, పాపయ్యలకు కూడా భక్తులు పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

కక్ష సాధింపులు మానండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వాకాడు : ఎన్నికల్లో గెలుపు ఓటములు సర్వ సాధారణమని, అందుచేత మండలంలోని టీడీపీ నాయకులు కక్ష సాధింపులు మానేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వాకాడులో విలేకరులతో మాట్లాడారు. తమ ప్రభుత్వంలో మండలంలో పార్టీలు, కులాలు, మతాలు, ప్రాంతాలు చూడకుండా పలు అభివృద్ధి పనులు చేశామని, సంక్షేమ పథకాలు అందించామన్నారు. మిగిలిపోయిన అభివృద్ధి పనులను టీడీపీ నాయకులు చేయాలని కోరారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కక్ష సాధింపులు మానుకోవాలన్నారు. బెదిరింపుల ద్వారా తమను లొంగదీసుకోవాలనుకోవడం సరికాదన్నారు. తీర ప్రాంతాలకు తెలుగు గంగ నీటిని తీసుకుపోవాలని, నిడిగుర్తిలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, బాలిరెడ్డిపాళెంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం, తీర ప్రాంతంలోని మత్స్యకారులకు శాశ్వత ముఖద్వారాలు నిర్మించాలని తాము తలపెట్టామన్నారు. అలాగే మొనపాళెం నుంచి చినతోట వరకు, రావిగుంటపాళెం నుంచి శ్రీనివాసపురం వరకు రోడ్లు, మరియమ్మ గుడి నుంచి తూపిలిపాళెం ఎస్‌బీటీ వరకు డబుల్ రోడ్డు, నలగమాల నుంచి మాధవాపురం వరకు రోడ్డు వేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. అందరమూ కలిసి మండల అభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రౌతు రామకృష్ణ, వైస్ ఎంపీపీ వాటంగారి వెంకటరమణయ్య, దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, దువ్వూరు భాస్కర్‌రెడ్డి, మారంరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, నలగామల మధురెడ్డి, తూపిలి మధురెడ్డి, ఎంబేటి జితేంద్ర, ఎంబేటి కోటయ్య, మహేంద్ర, వాకాటి రవి, గూడూరు వెంకటేశ్వర్లు, పంగనామాల కిషోర్, పరుశురామయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న గంగమ్మ

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని బజారు వీధిలో ఉన్న గంగమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాలను మూడు రోజులు ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సన్నాహాలు చేపట్టారు. ఈ క్రమంలోనే తొలి రోజు సోమవారం పూలంగి సేవ చేపట్టారు. ఇందులో భాగంగా వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ మూడు రోజులు వివిధ పూజలు చేస్తామన్నారు. చివరి రోజున గ్రామోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

మాతమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్ : ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం సోమవారం అగ్రహారపేట అరుంధతీయ కాలనీలోని మాతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ పూజారి బాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలు చేయించారు. అనంతరం వారు మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

నాయీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షునికి సన్మానం



శాంతారామ్‌ను సన్మానిస్తున్న నాయకులు

నాయుడుపేట టౌన్ : నాయీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు శాంతారామ్‌కు సోమవారం ఆ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. శాంతారామ్ సోమవారం విజయవాడకు బయలుదేరారు. ఆయనను ఆ సంఘం నాయకులు నాయుడుపేట పట్టణంలోని అమరావతి సెంటర్‌లో నిలిపి సన్మానించారు. ఆ సంఘం ఉపాధ్యక్షుడు వినుకొండ ధనుంజయ, శివ, శీను, ఆనంద్, కుమార్, మునికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు చైర్ పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కమిషనర్ జనార్ధన్‌రెడ్డి సోమవారం తెలిపారు. వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు సమావేశానికి హాజరుకావాలని, పలు సమస్యలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు.

మత్స్యకారుల గుర్తింపు కార్డుల రెన్యువల్

చిల్లకూరు : సముద్రంలో చేపల వేటకు విధించిన నిషేధ సమయం ముగిసింది. ఈ క్రమంలో మత్స్యకారులు మళ్లీ వేట కొనసాగించుకునేందుకు అవసరమైన చర్యలను అధికారులు చేపట్టారు. వారు సోమవారం తీర ప్రాంతంలోని పలు మత్స్యకార గ్రామాల్లో పర్యటించారు. పడవలు ఉన్న యజమానులను గుర్తించి వారికి గతంలో ఇచ్చిన గుర్తుంపు కార్డులు, డీజిల్ రాయితీ కార్డులను రెన్యువల్ చేయడంపై అవగాహన కల్పించారు. మత్స్యకారులు గతంలో భద్రం చేసుకున్న పడవల పరిస్థితి, వలల పటుత్వంపై దృష్టి పెట్టారు. ఈ నెల 15న వేటకు సర్వసిద్ధం చేసేలా చూస్తున్నట్లు మత్స్యశాఖాధికారి రఘుబాబు తెలిపారు.


మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

పెళ్లకూరు: మండలంలోని చింతపూడి గ్రామానికి చెందిన తెల్లగూటి గంగమ్మ మెడలో ఉన్న నాలుగు సవర్లు బంగారు గొలుసును ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆమె కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమైంది. ఆదివారం రాత్రి ఇంటి ఆవరణలో నిద్రించింది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న గొలుసును కత్తిరించుకుని వెళ్లారు. ఈ విషయమై బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ కమిటీల రద్దుకు కసరత్తు

చిల్లకూరు : గత ప్రభుత్వంలో నియమించిన ఆలయాల పాలకమండళ్లను రద్దు చేసే ఆలోచనలో టీడీపీ ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పాలక మండళ్ల సభ్యులు, చైర్మన్‌లకు దేవదాయశాఖ అధికారులు సమాచారం ఇచ్చినట్టు సమాచారం. తమ పరిస్థితిని అర్థం చేసుకుని, రాజీనామాలు ఇచ్చి తప్పుకోవాలని అభ్యర్థిస్తున్నట్లు తెలిసింది. వచ్చే ఏడాది జూన్ వరకు కొన్ని ఆలయాల పాలక మండలి కొనసాగే అవకాశాలు ఉన్నప్పటికీ కొత్తగా అధికారంలోకి రాగానే పాత పాలక మండలిని రద్దు చేసేందుకు ఒత్తిడి తెస్తున్నారు. దీనిపై జీవో తీసుకువస్తే ఎవరైనా కోర్టుకు వెళ్లే అవకాశం ఉందని భావించి అధికారుల ద్వారా ఒత్తిడి పెంచుతున్నా రు. ఈ క్రమంలోనే గూడూరు పట్టణంలోని ద్రౌపది దేవి సమేత ధర్మరాజుల దేవస్థానం, చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నంలోని కోదండరామస్వామి ఆలయం, తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయం, కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, చిట్టమూరు మండలం మల్లాంలోని వల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆల య పాలక మండలిని రద్దు చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై దేవదాయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబును వివరణ కోరగా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదని, పాలక మండలి సభ్యులు ముందుకు వచ్చి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారని అన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి



ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

వెంకటగిరి రూరల్ : పాలకేంద్రం సమీపంలోని పినాకిని బార్ అండ్ రెస్టారెంట్ వద్ద బొప్పాపురానికి చెందిన బొక్కసం విజయ్‌కుమార్ హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. వారు సోమవారం వెంకటగిరి పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేశారు. పాతకక్షల నేపథ్యంలోనే తమ బిడ్డను హత్య చేయించారని వాపోయారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని నినాదాలు చేస్తూ స్టేషన్ ఎదుట భైఠాయించారు. పోలీసులు వారితో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం విజయ్ మృతదేహానికి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

సిద్ధిలేశ్వర కోనలో గల్లంతైన విద్యార్థి మృతి



మహేంద్ర మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మాల్యాద్రి

రాపూరు: రాపూరు–చిట్వేలి రోడ్డులోని సిద్ధిలేశ్వర కోనలో గుండంలో ఆదివారం గల్లంగైన విద్యార్థి మహేంద్ర(18) మృత దేహం సోమవారం బయటపడింది. ఎస్‌ఐ మాల్యాద్రి సోమవారం విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు మూడో మైలుకు చెందిన కొటారు సురేష్ కుమారుడు మహేంద్ర ఇంటర్ చదివాడని తెలిపారు. మహేంద్ర ఆదివారం గ్రామానికి చెందిన దుశాంత్, సంతోష్, హరిహరన్, సయ్యద్ కైఫ్‌తో కలిసి రాపూరు మండలం వెలుగొండల్లోని సిద్ధిలేశ్వర కోనకు వచ్చాడని తెలిపారు. జలపాతం వద్ద ఉన్న నీటిగుండంలో ఈత కొడుతూ మునిగిపోయాడన్నారు. అతని మిత్రులు రాపూరు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు, గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. చీకటి పడడంతో సోమవారం ఉదయం మరోసారి గాలింపు చర్యలు చేపట్టగా మహేంద్ర మృతదేహం కనిపించిందన్నారు. మహేంద్ర తండ్రి సురేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహానికి పంచనామా చేసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వివరించారు.

మృత్యుంజయస్వామికి ఆగమోక్తంగా పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విబూధి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



అత్తివరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ

ఓజిలి: ప్రధానమంత్రి సురక్షిత యోజన పథకం కింద గర్భిణులకు ప్రతి నెలా చేస్తున్న వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి ప్రవీణ తెలిపారు. అత్తివరం ఆరోగ్య కేంద్రంలో సోమవారం 15 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. నెలలో రెండు సార్లు వైద్యుడి వద్ద పరీక్షలు చేసుకుని సలహాలు తీసుకోవాలన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వజ్జవారిపాళెం, అత్తివరం, పెదపరియ ఆరోగ్యకేంద్రాల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజగోపాల్, ఏ సుబాషిణి, జయసూర్య, ఏఎన్‌ఎంలు కుసుమకుమారి, మల్లీశ్వరి, జ్యోతి, గీత, వేణుగోపాల్, ఝాన్సీ పాల్గొన్నారు. అలాగే గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహంలో దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. పరిసరాలను పరిశుభ్రం చేయించారు.

ఏపీ హంస నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గంలో జిల్లా యూనియన్ నాయకులు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఏపీ హంస సర్వసభ్య సమావేశంను రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్ అధ్యక్షతన నూతన కార్యవర్గంను ఎంపిక చేశారు. ఏపీ హంస హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ అసోసియేషన్ గూడూరు తాలూకా అధ్యక్షురాలిగా జోగి పద్మ, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కె.శ్రీహరి, సెక్రటరీగా సుజిత్‌కుమార్, ట్రెజరర్‌గా వి.సుప్రజ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయలక్ష్మి, పబ్లిసిటీ సెక్రటరీగా అబీదా, ఉపాధ్యక్షులుగా అనూష, జ్యోతి, అరుణ, పెంచలసుబ్బయ్య, శేషమ్మ, మహిళా వింగ్ సెక్రటరీగా ఆదిలక్ష్మి, జాయింగ్ సెక్రటరీగా శ్రీనివాసులు, రాజేష్ తదితరులను ఎంపిక చేశారు. జిల్లా ట్రెజరర్ ఎండీ మజహరుల్లా, టి.రాజయ్య ఆధ్వర్యంలో ఈ ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సుధీకర్‌రావు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖ గుర్తింపు పొందిన మొదటి యూనియన్ తమదేనన్నారు. నిజాయితీగా సేవలందించే ఉద్యోగులను మాత్రమే ఆహ్వానిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు జనార్ధన్ రావు, శ్రావణి పాల్గొన్నారు.

బైక్ అపహరించిన కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

తడ: దారి కాచి, కత్తి ఉందని బెదిరించి బైక్‌ను అపహరించిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ పి.నరసింహారావు సోమవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. వరదయ్యపాళెం మండలం పులివెల్లం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు శనివారం రాత్రి బైక్‌పై మాంబట్టు సెజ్‌లోని ఓ ప్రైవేటు పరిశ్రమలో విధులకు వెళుతున్నారు. మాంబట్టు వద్ద కొందరు వ్యక్తులు వారిని కత్తితో బెదిరించారు. దీంతో యువకులు బైక్ వదిలిపెట్టి భయంతో పరుగులు తీశారు. నిందితులు బైక్‌ను అపహరించుకుని వెళ్లారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సోమవారం కాదలూరు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో తడ మండలం వెండ్లూరుపాడు గ్రామానికి చెందిన బూరగ తేజ, సూళ్లూరుపేట పట్టణంలోని కావలి వీధికి చెందిన వరుణ్ ముఖేష్, సూళ్లూరుకు చెందిన మీజూరు దినేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కమ్ముకున్న కారుమబ్బులు



డీవీ సత్రంలో కమ్ముకున్న కారుమబ్బులు

దొరవారిసత్రం : నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో గత వారం నుంచి అడపాదడపా అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. మండలంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం ఆకాశం కారుమబ్బులు కమ్ముకుని చల్లగాలులు వీశాయి. కొన్ని దగ్గర చిరుజల్లులు పడ్డాయి. ఆదివారం రాత్రి బలమైన గాలులు వీచి భారీ వర్షం పడడంతో దొరవారిసత్రంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ తీగలపై చెట్లు పడిపోయి తీగలు తెగిపోయాయి. దీంతో డీవీ సత్రం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.